సాక్షి
వికారాబాద్

గురువారం ၊ 16 ၊ అక్టోబర్ ၊ 2025



ఇసుక పక్కదారి!

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పేరున తీసుకెళ్తున్న ఇసుకను ట్రాక్టర్ యజమానులు పక్కదారి పట్టిస్తున్నారు. 10లో▸



పెండింగ్ వేతనాల కోసం..

పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ బొంరాస్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల గెస్ట్ లెక్చరర్లు ఆందోళన చేపట్టారు. 10లో▸



చిరుధాన్యాలతో ఆరోగ్యం

చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీఓ రాములు పేర్కొన్నారు. 11లో▸

న్యూస్‌రీల్

ఆర్‌డీఓ వాసుచంద్రకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి



అనంతగిరి: వికారాబాద్ ఆర్‌డీఓ వాసు చంద్రకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో తోటి ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

డీసీసీ అధ్యక్ష పదవి కోసం రఘువీరారెడ్డి దరఖాస్తు



దరఖాస్తు చేసుకుంటున్న రఘువీరారెడ్డి

ధారూరు: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి రేసులో పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి పోటీ పడుతున్నారు. బుధవారం వికారాబాద్‌లో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పరిశీలకుడు సూరత్‌సింగ్ ఠాగూర్‌ను కలిసి తనకు అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరారు. ఈ మేరకు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

కొడంగల్: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రివాల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజు కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు లేవన్నారు. మెస్ చార్జీలను పెంచాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. గురుకులాలు, కస్తూర్బాల్లో సౌకర్యాలు పెంచాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులను, గురుకులాల్లో అధ్యాపకులను నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కేజీబీవీల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

యాలాల: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో హెడ్ కుక్, డే వాచ్ ఉమెన్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి చెందిన మహిళా అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులన్నారు. 18 నుంచి 45 ఏళ్ల లోపు ఉన్న వారు హెడ్ కుక్ పోస్టుకు, డే వాచ్ ఉమెన్ పోస్టుకు 10వ తరగతి పాసై ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు ఈ నెలా 27వ తేదీలోపు కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ సూచించారు.

పరిగి మండలంలో..

పరిగి: మండలంలోని నస్కల్ కేజీబీవీ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లో వాచ్‌మెన్, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మండల విద్యాధికారి గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీలోపు మండల విద్యావనరుల కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హెడ్ కుక్ పోస్టు భర్తీకి..

దౌల్తాబాద్: మండలంలోని బాలంపేట కేజీబీవీలో హెడ్‌కుక్ పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ వెంకట్ స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి చెందిన మహిళలు ఈ నెల 25వ తేదీ లోగా ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కాంట్రాక్ట్ పద్ధతిలో..

బషీరాబాద్: మండల కేంద్రంలోని కేజీబీవీలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఓ సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 వయసు కలిగి మండలానికి చెందిన మహిళలు అర్హులని తెలిపారు. మహిళా వాచ్‌మెన్ ఉద్యోగానికి కనీసం పదో తరగతి ఉత్తీర్ణత సాధించి, సెక్యూరిటీ విభాగంలో శిక్షణ పొందిన అనుభవం ఉండాలన్నారు. అలాగే స్వావెంజర్, అసిస్టెంట్ కుక్ ఉద్యోగాలకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత సాధించిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 20లోపు బషీరాబాద్‌లోని కేజీబీవీ పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని ఎస్ఓ సుకోరారు.

వేట.. తూటా!

వన్య ప్రాణులపై వేటగాళ్ల గురి

- గతంలో బాణాపూర్ అటవీ ప్రాంతంలో లభించిన బుల్లెట్ మ్యాగ్జిన్, తపంచా
- తాజాగా ఇదే గ్రామ శివారులో మృతి చెందిన వ్యక్తి వద్ద నాటు తుపాకీ
- ఆందోళన రేపుతున్న ఘటనలు



గతంలో అడాల్‌పూర్ అటవీ ప్రాంతంలో పశువుల కాపరికి దొరికిన తపంచా

యాలాల: మండలంలోని బాణాపూర్, అడాల్‌పూర్ పరిధిలోని రిజర్వ్ ఫారెస్టులో వన్య ప్రాణుల వేట సాగుతోంది. మంగళవారం బాణాపూర్ శివారులో ఓ వ్యక్తి కరెంటు షాక్‌తో మృతి చెందగా అతని వద్ద నాటు తుపాకీ లభించింది. దీంతో వేటగాళ్ల సంచారం మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో ఇదే ప్రాంతంలో బుల్లెట్ మ్యాగ్జిన్, తపంచా లభించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కొన్ని రోజుల పాటు స్తబ్దుగా ఉన్న ఈ వ్యవహారం తాజాగా నాటుతుపాకీ లభించడంతో ఆందోళన కలిగిస్తోంది. వన్య ప్రాణుల వేట జరుగుతుందనే దానికి బలం చేకూర్చుతోంది.

వారాంతపు సెలవుల్లో..

బాణాపూర్, అడాల్‌పూర్ పరిధిలో భారీగా రిజర్వ్ ఫారెస్టు ఉంది. ఈ ప్రాంతంలో ఎక్కువగా దుప్పిలు, అడవి పందులు, కుందేళ్లు, నెమళ్లు, నక్కలు, అటవీ పిల్లులు(జంగ పిల్లి) ఉన్నాయి. వారాంతపు రోజులతో పాటు వరుసగా వచ్చే సెలవు రోజుల్లో వేటగాళ్లు వేటకు వస్తుంటారు. తాండూరుతో పాటు హైదరాబాద్, వికారాబాద్ లాంటి ప్రాంతాల నుంచి అపరిచిత వ్యక్తులు వస్తుంటారని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో స్థానికుల సాయంతో వన్య ప్రాణులను వేటాడుతున్నట్లు తెలిసింది. కొందరూ సరదా కోసం వస్తుండగా.. మరికొందరూ వన్య ప్రాణుల మాంసం విక్రయించడానికి వేట కొనసాగిస్తున్నట్లు సమాచారం.

తరచూ లభిస్తున్న ఆయుధాలు

2018లో అడాల్‌పూర్ పరిధిలోని అటవీ ప్రాంతంలో పశువుల కాపరికి బుల్లెట్ మ్యాగ్జిన్ లభించగా, అదే ఏడాది ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు తపంచా దొరకడం చర్చనీయాంశంగా మారింది. అటవీ ప్రాంతంలో వేట కోసం వచ్చిన వారు ప్రమాదవశాత్తు ఆయుధాలు పాగొట్టుకున్నట్లు తెలిసింది. తాజాగా మంగళవారం లభించిన నాటుతుపాకీతో ఈ ప్రాంతంలో విచ్చలవిడిగా వేట సాగుతుందనే ప్రచారం జరుగుతోంది.

పొలాలకు కరెంటు తీగలు

పంటలను రక్షించుకునేందుకు అటవీ ప్రాంతంలో పట్టా భూములతో పాటు పోడుభూములు కలిగిన రైతులు పొలాల చుట్టూ తీగను ఏర్పాటు చేసి కరెంటు సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో అనేక సార్లు వన్యప్రాణులతో పాటు మనుషుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నారు. అటవీ ప్రాంతంలో వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు ఇటువంటి తీగకు తగిలి ప్రాణాలు కోల్పోయాడు. అటు వేటగాళ్లతో పాటు అటవీ ప్రాంతంలో బీట్లకు తిరిగే ఫారెస్టు అధికారులకు ఈ ముప్పు పొంచి ఉంది. ఈ విషయంలో అధికారులు రైతులకు అవగాహన కల్పించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



తాజాగా లభించిన నాటు తుపాకీ

విచారణ చేపట్టాం

అడాల్‌పూర్, బాణాపూర్ ఫారెస్టు ఏరియాల్లో ఏడాది కాలంగా వేట పట్ల కఠినంగా ఉంటున్నాం. ఈ విషయమై ఇటీవల బాణాపూర్‌లో జిల్లా అధికారితో అవగాహన కార్యక్రమం నిర్వహించాం. అయినా అన్నసాగర్ వాసి వద్ద నాటు తుపాకీ లభించింది. ఈ ఘటనపై విచారణ చేపట్టాం. యాలాల పోలీసుల సహకారంతో అనుమానితుల వద్ద ఆయుధాలు ఉంటే, వారి విషయంలో కఠినంగా వ్యవహించేలా ముందుకెళ్తాం.

– రాజేందర్, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర అధికారులు

- కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: జిల్లాలో ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం నగరం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం సేకరణపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 1.52 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారని, 3,84,800 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. 129 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రవాణా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు వివరించారు. ధాన్యం విక్రయించిన 24 గంటల లోపే ట్యాబ్ ఎంట్రీ జరిగేలా ఏర్పాట్లు చేశామన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీఎస్‌ఓ సుదర్శన్, సివిల్ సప్లయ్ డీఎం మోహన్ కృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం, డీసీఓ నాగార్జున, లీగల్ మెట్రోలజీ అధికారి ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం

కొడంగల్ పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయ విస్తరణలో భాగంగా ఇండ్లు కోల్పోతున్న వారితో బుధవారం కలెక్టర్ ప్రతీక్ జైన్ సమావేశమయ్యారు. ఆలయ విస్తరణ కోసం సుమారు 8వేల గజాల భూమి సేకరించడం జరిగిందన్నారు. ఇళ్ల విలువను బట్టి నష్టపరిహారం తోపాటు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించడం జరుగుతుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, డీఆర్ఓ మంగీలాల్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఆలయ ఈఓ రాజేందర్ రెడ్డి, తహసీల్దార్ రాంబాబు, జీ సెక్షన్ సూపరింటెండెంట్ నఫీజ్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన పోలీసులతో ఎస్పీ నారాయణరెడ్డి

పర్యాటకుల భద్రతే లక్ష్యం

ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: పర్యాటకుల భద్రతే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం వికారాబాద్‌లోని ఎస్పీ కార్యాలయ ఆవరణలో జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ జ్ఞానేశ్వర్‌తో కలిసి ఇటీవల టూరిస్ట్ పోలీస్ అధికారులుగా శిక్షణ పొందిన వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా టూరిస్ట్ పోలీస్ వ్యవస్థను తొలిసారిగా ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాకు చెందిన 10మంది పోలీసులు శిక్షణ పొందినట్లు తెలిపారు. వీరు ప్రముఖ పర్యాటక కేంద్రాలైన అనంత పద్మనాభ స్వామి దేవాలయం, అనంతగిరి అటవీ ప్రాంతం, కోట్‌పల్లి రిజర్వాయర్, బుగ్గ వంటి ప్రాంతాల్లో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

- కాంగ్రెస్‌పై ప్రజలకు నమ్మకం పోయింది
- ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: ఎన్నికల హామీలను అమలు చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. దోమ మండలం గూడూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం మాజీ ఎమ్మెల్యే నివాసంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు విసుగొచ్చిందన్నారు. ఎక్కడికి వెళ్లినా కేసీఆర్ పాలను గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ పనితీరు నచ్చక ఎంతో మంది కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. హామీలను నెరవేర్చేంత వరకు బీఆర్‌ఎస్ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస సత్తా ఎంతో చూపుతామన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ ఎన్నికలను ఆలస్యం చేస్తోందని ఆరోపించారు. ఏ గ్రామానికి వెళ్లిన బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధే కనిపిస్తోందని అన్నారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. ఇతర పార్టీల్లోంచి బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొప్పుల నాగిరెడ్డి, దోమ మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం, నాయకులు రఘుమోహన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేఖల దుమారం

తాండూరు: తాండూరు మండలంలోని చెట్టినాడ్ సిమెంట్ పరిశ్రమకు సంబంధించిన రైల్వే లైన్ పనులపై రాజకీయ లేఖల దుమారం నడుస్తోంది. ఈ పనుల కారణంగా గుంతబాస్పల్లి, సంగెంకలాన్ గ్రామాల్లోకి వరద నీరు చేరుతోంది. కాలనీ వాసులతోపాటు, పంటలకు తీవ్ర నష్టం జరుగుతోంది. న్యాయం చేయాలంటూ బాధితులు చాలా రోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సంగెంకలాన్ గ్రామంలో పర్యటించి బాధిత రైతులకు న్యాయం చేయాలని, లేకుంటే పరిశ్రమను మూసి వేయిస్తామని హెచ్చరించారు. ఈ విషయమై ఎమ్మెల్యే బీఎంఆర్‌కు కూడా ఫోన్ చేశారు. ఈ నేపథ్యంలో గత నెల 29న తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దక్షిణ మధ్య రైల్వే శాఖ జనరల్ మేనేజర్‌కు రాసిన లేఖ బుధవారం బయటికి వచ్చింది. రైల్వే లైన్ పనుల కారణంగా 150 ఇళ్లకు, 200 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందని లేఖలో పేర్కొన్నారు. నిబంధనల మేరకు బ్రిడ్జి నిర్మించకపోవడంతోనే సమస్య ఉత్పన్నమవుతున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే లేఖ బయటికి వచ్చిన కొద్ది సేపటికే ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చెట్టినాడ్ పరిశ్రమ ఎండీకి లేఖ రాయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

మెడికల్ కళాశాలను తరలించొద్దు

- అప్పాయిపల్లిలోనే భవనం నిర్మించాలి
- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

కొడంగల్: ప్రభుత్వ మెడికల్ కళాశాలను మండలంలోని అప్పాయిపల్లిలోనే నిర్వహించాలని, ఇక్కడే భవనాలు నిర్మించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం పట్టణంలో పార్టీ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు దయాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మధుయాదవ్, మాజీ సర్పంచు రమేష్‌బాబు, కేడీపీ జేఏసీ కో కన్వీనర్ ఎరన్‌పల్లి శ్రీనివాస్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గానికి కొడంగల్ ముఖ చిత్రం లాంటిదని పేర్కొన్నారు. ముందుగా కొడంగల్‌ను అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలపాలన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే ఈ ప్రాంతం అన్ని రంగాల్లోనూ పురోగతి సాధిస్తుందని ప్రజలు నమ్మి ఓట్లు వేశారని అన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత కొడంగల్‌కు ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంజూరు చేశారని తెలిపారు. భవన నిర్మాణం కోసం అప్పాయిపల్లిలో రైతుల నుంచి 50 ఎకరాలకు పైగా భూమిని సేకరించారని పేర్కొన్నారు. పక్కనే జాతీయ రహదారి ఉందన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, రోగులు రాకపోకలు సాగించడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. కొడంగల్‌కు మంజూరైన మెడికల్ కళాశాలను లగచర్లకు తరలిస్తున్నారని ఆరోపించారు. కేడీపీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం తలపెట్టిన కొడంగల్ బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉడిమేశ్వరం మధు, రుద్రారం మధుసూదన్‌రెడ్డి, నవాజొద్దీన్, సముద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

బంద్‌కు సహకరించాలి: కేడీపీ జేఏసీ

కొడంగల్ అభివృద్ధి పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ (కేడీపీ జేఏసీ) ఆధ్వర్యంలో గురువారం తలపెట్టిన పట్టణ బంద్‌కు సహకరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంఈఓ రాంరెడ్డికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం జిల్లా సహాయ కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడికల్ కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాలను లగచర్లకు తరలించడాన్ని నిరసిస్తూ బంద్ పాటించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని కోరారు. కొడంగల్ బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇస్తున్నారని తెలిపారు. కుల మత వర్గ భేదం లేకుండా అందరి సహకారం ఉందన్నారు. కొడంగల్‌కు మంజూరు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలను, గురుకులాలను కొడంగల్ శివారులోనే నిర్వహించాలని, అక్కడే భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ముందుగా ప్రకటించినట్లుగా మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ గ్రామ శివారులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల, మండల పరిధిలోని ఎరన్‌పల్లి గ్రామ శివారులో మెడికల్ కళాశాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మారుతి తదితరులు పాల్గొన్నారు.



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మురుగు సమస్య ఉండొద్దు

గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశం

తాండూరు: తాండూరు పట్టణంలో మురుగు కాల్వల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాగ్నానదిలో కలుస్తుండటంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ విషయమై తాండూరు పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త, తాండూరు సిటిజెన్ వెల్ఫేర్ సొసైటీ సభ్యుడు రాజ్‌గోపాల్ రెండేళ్ల క్రితం జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌లో చెన్నై జోన్‌ను ఆశ్రయించారు. అప్పటి నుంచి కేసు కొనసాగుతోంది. ఈ నెల 8న వాదనలు జరిగాయి. మురుగు కాల్వల నిర్మాణానికి నాలుగు సార్లు టెండర్లు వేసినా కాంట్రాక్టర్లు రాలేదని కలెక్టర్ తరఫు న్యాయవాది గ్రీన్ ట్రిబ్యునల్ దృష్టికి తెచ్చారు. మూడు వారాల్లో సమస్యను పరిష్కరించాలని ట్రిబ్యునల్ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాజ్‌గోపాల్ పేర్కొన్నారు.

నేడు పోషణ మాసోత్సవాలు

కొడంగల్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి పట్టణంలోని మురహరి పంక్షన్ హాల్‌లో పోషణ మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ రూప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16వరకు రాష్ట్రీయ పోషణ మాసం జరిగిందన్నారు. చివరి రోజు ఉత్సవాలు కొడంగల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చొద్దు

షాద్‌నగర్‌రూరల్: రీజినల్ రింగ్‌రోడ్డు (ట్రిపుల్‌ఆర్)ను పాత అలైన్‌మెంట్ ప్రకారమే నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా బుధవారం పార్టీ డివిజన్ కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనునాయక్ ఆధ్వర్యంలో ట్రిపుల్‌ఆర్ భూ నిర్వాసితులు రిలే దీక్షలు చేపట్టారు. దీక్షలకు మద్దతు తెలిపిన యాదయ్య మాట్లాడుతూ.. వందల ఎకరాల భూస్వాముల భూముల్లో కాకుండా పేద, చిన్న, సన్నకారు రైతుల భూములను ఆక్రమిస్తూ రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టడం దారుణమని విమర్శించారు. పేద రైతుల భూములు లాక్కుంటే అడిగేవారు ఉండరనే ఆలోచనతో రేవంత్‌రెడ్డి సర్కార్ ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చిందని ఆరోపించారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్ణయంతో అనేక మంది పేద రైతులు తమ విలువైన భూములను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో భూ నిర్వాసితులు పూజారి లక్ష్మయ్య, రమేష్, చంద్రకాంత్, నగేష్, సుదర్శన్‌రెడ్డి, శ్రీకాంత్, మహ్మద్‌బాబు, కుర్మయ్య, ఈశ్వర్, రాజు, బొజ్జనాయక్, రాజేష్, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

అడవి జంతువుల దాడిలో దూడ మృతి



మృతిచెందిన దూడ

కుల్కచర్ల: గుర్తు తెలియని అడవి జంతువు దాడిలో దూడ మృతిచెందిన ఘటన కుల్కచర్ల మండలంలో చోటుచేసుకుంది. అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ మొయినొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. ముజాహిద్‌పూర్‌కు చెందిన రైతు చిలుముల బాలకృష్ణయ్య ఎప్పటిలాగే మంగళవారం రాత్రి తన పశువులను పొలం వద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయాన్నే వెళ్లి చూడగా దూడ రక్తపు మడుగులో పడి ఉంది. సమీపంలోని పొలంలో అడవిజంతువుల పాద ముద్రలు కనిపించడంతో ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న వారు ట్రాప్ కెమెరా ఏర్పాటు చేశారు. పశువులను అటవీ ప్రాంతంలో ఉంచొద్దని రైతులకు సూచించారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించండి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్



మాధవరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మణ్‌యాదవ్

బంట్వారం: విద్యార్థులకు పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్‌యాదవ్ కోరారు. బుధవారం ఆయన జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి (డీబీసీడబ్ల్యూఓ) మాధవ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం 2024 వరకు 50 శాతం పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసిందని.. పూర్తిగా విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథ్‌యాదవ్, ఏబీసీడబ్ల్యూఓ భీంరావు పాల్గొన్నారు.

75 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కుల్కచర్ల: సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడిలో భారీగా రేషన్ బియ్యం పట్టుబడిన ఘటన మండల పరిధిలోని రాంరెడ్డిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామంలోని ఓ ఇంట్లో 150 బస్తాల (75 క్వింటాళ్లు) సన్నబియ్యం నిల్వలున్నట్లు సివిల్ సప్లై అధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు వారు దాడి చేసి 75 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

డీసీసీ అవకాశం కల్పించండి



దరఖాస్తు అందజేస్తున్న కృష్ణారెడ్డి

బంట్వారం: నాలుగు దశాబ్దాలుగా హస్తం పార్టీలో సేవలందిస్తూ వివిధ హోదాల్లో పని చేశానని, డీసీసీ అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించాలని బ్లాక్- 2 కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.కృష్ణారెడ్డి ఏఐసీసీ అబ్జర్వర్ ఠాకూర్‌ను కలిసి దరఖాస్తు అందజేశారు.

'ఫ్యూచర్'కు భూములిచ్చి సహకరించండి

కందుకూరు: ఫ్యూచర్ సిటీకి భూములు ఇచ్చి సహకరించాలని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని తిమ్మాయిపల్లి రెవెన్యూ సర్వే నంబర్ 9లోని 400 ఎకరాల అసైన్డ్, ప్రభుత్వ భూమిని ఫ్యూచర్‌సిటీలో భాగంగా సేకరించడానికి బుధవారం టీజీఐఐసీ అధికారులతో కలిసి మండల పరిషత్ సమావేశ హాల్‌లో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎకరాకు చట్ట ప్రకారం కాకుండా అదనంగా రూ.55 లక్షల చొప్పున చెల్లిస్తామని, భూములు ఇవ్వాలని అన్నారు. దీంతో పాటు భూమిలో చెట్లు, నిర్మాణాలు, బోర్లు ఉంటే అదనంగా అందుతుందన్నారు. రైతులు మాత్రం తమకు ఎకరాకు రూ.2 కోట్ల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పి సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రవణ్ కుమార్, నాయబ్ తహసీల్దార్ శేఖర్, ఆర్‌ఐ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇసుక పక్కదారి!

అనుమతుల పేరిట ప్రైవేటు వ్యక్తులకు విక్రయం

- సర్కారు ఆదాయానికి గండి
- జేబులు నింపుకొంటున్న అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు



ఎక్మాయి వాగులో బుధవారం బారులు తీరిన ఇసుక ట్రాక్టర్లు

బషీరాబాద్: ఇందిరమ్మ లబ్ధిదారుల పేరున తీసుకెళుతున్న ఇసుకను ట్రాక్టర్ యజమానులు పక్కదారి పట్టిస్తున్నారు. గ్రామాల్లో ఇతర వ్యక్తులు, ప్రైవేటు నిర్మాణాలకు రూ.4 వేలకు ట్రిప్పు చొప్పున విక్రయిస్తూ జేబులు నింపుకొంటున్నారు. దీని పర్యవేక్షణ చేయాల్సిన ఒకరిద్దరు కింది స్థాయి సిబ్బంది అక్రమార్కులతో చేతులు కలిపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బుధవారం మైల్వార్ గ్రామానికి చెందిన ఓ వ్యాపారి అధికార పార్టీ నాయకుడి అండతో నాలుగు ట్రాక్టర్లతో ఇసుక రవాణా చేశాడు. పట్టపగలు అనుమతులు లేకుండా ప్రైవేటు వ్యక్తులకు విక్రయించినట్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రెచ్చిపోతున్న అక్రమార్కులు

మండలంలోని వాగులు, వంకల మీద పడుతున్న అక్రమార్కులు రాత్రింబవళ్లు ఇసుక తోడి రవాణా చేస్తున్నారు. గృహనిర్మాణ లబ్ధిదారుల పేరు చెప్పి యథేచ్ఛగా బయట అమ్మేస్తున్నారు. మండలంలో ఏ ప్రభుత్వ భవనాల నిర్మాణాలకైనా, ఇందిరమ్మ ఇళ్లకైనా నావంద్గీ కాగ్నానది రీచ్ నుంచి ఇసుక అనుమతులు ఇవ్వాలి. అయితే ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలకు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.600 చొప్పున బ్యాంకులో డీడీ తీసి తహసీల్దార్ కార్యాలయంలో ఇస్తే అనుమతులు ఇస్తారు. ఇందిరమ్మ ఇళ్లకు మాత్రం ప్రభుత్వం నుంచి ఫ్రీగా పర్మిషన్ ఇస్తున్నారు. దీన్ని అదనుగా తీసుకుంటున్న అక్రమార్కులు వాగులు, వంకల్లో యథేచ్ఛగా ఇసుక తోడేస్తున్నారు. మైల్వార్, ఎక్మాయి, దామర్‌చెడ్, కొత్లాపూర్ గ్రామాలకు చెందిన ఇసుక వ్యాపారులకు ఇందిరమ్మ ఇళ్లు వరంగా మారాయి. లబ్ధిదారుల ప్రొసీడింగ్ కాపీలను తీసుకువచ్చి అనుమతులు తీసుకుంటున్నారు. వాస్తవానికి లబ్ధిదారులకు ఎంత ఇసుక అవసరమకో హౌసింగ్ ఏఈ ద్వారా లెటర్ తీసుకుని తహసీల్దార్‌కు ఇవ్వాలి. ఆతర్వాతే ఇసుక పర్మిట్లు పంపిణీ చేయాలి. కానీ ఇక్కడ ఇవేవీ జరగడం లేదు.

సీజ్ చేస్తాం



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఆగిపోకూడదనే అనుమతులు ఇస్తున్నాం. పక్కదారి పట్టించే ట్రాక్టర్లను సీజ్ చేస్తాం. ఎక్మాయి వాగులో ఇసుక రవాణాను అడ్డుకోవడానికి రెవెన్యూ సిబ్బంది వెళ్లేసరికే అక్రమార్కులు పారిపోయారు. ఇందులో సిబ్బంది ప్రమేయం ఉంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– షాహిదాబేగం, తహసీల్దార్

కలెక్టర్ ఆదేశాలతో కదలిన యంత్రాంగం

- చంద్రవంచ, చిట్టిఘనాపూర్ వాగులను పరిశీలించిన అధికారుల బృందం
- పూర్తి నివేదిక కలెక్టర్‌కు అందజేస్తాం: డీపీఓ జయసుధ



రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీపీఓ జయసుధ

తాండూరు రూరల్: ఇసుక అక్రమ రవాణాపై అందిన ఫిర్యాదుల మేరకు కలెక్టర్ ప్రతీక్‌జైన్ స్పందించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించాలని డీపీఓ జయసుధను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆమె తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీఓ విశ్వప్రసాద్, మైన్స్ ఆర్‌ఐ నిర్మల, మైన్స్ జియాలజిస్ట్ రవికుమార్, ఇరిగేషన్ ఏఈ సాయిబన్నతో కలిసి మండల పరిధిలోని చంద్రవంచ, చిట్టిఘనాపూర్ గ్రామ శివారులోని వాగుల్లో ఇసుక రీచ్‌లను పరిశీలించారు. వాగు సమీపంలో ఉన్న రైతుల నుంచి ఇసుక అక్రమ రవాణాపై వివరాలు సేకరించారు. పూర్తి నివేదిక కలెక్టర్‌కు అందజేస్తామని డీపీఓ జయసుధ అన్నారు. కాగా చంద్రవంచ వాగు నుంచి ఇసుక తరలించే వీలు లేదని.. చిట్టిఘనాపూర్ వాగు నుంచి తరలించే అవకాశం ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు ప్రాథమిక సమాచారం.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి

మోమిన్‌పేట: తల్లీపిల్లల ఆరోగ్యానికి పౌష్టికాహారం అవసరమని ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మోమిన్‌పేట పంచాయతీ కార్యాలయంలో పోషణ మాసోత్సవాల సంబురాల్లో భాగంగా చిన్నారులకు సామూహిక అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. తల్లీపిల్లల ఆరోగ్యానికి సహజ సిద్ధంగా లభించే వనరులపై ఆధారపడాలన్నారు. ఆకుకూరలు తప్పక తీసుకోవాలన్నారు. కూరగాయలు, పండ్లు, గ్రుడ్లు, పాలు నిత్యం స్వీకరించడంతో ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. బాలామృతంతో మానసికంగా, శారీరకంగా అభివృద్ధి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత, శశికళ, పంచాయతీ కార్యదర్శి స్వప్న పాల్గొన్నారు.



సంఘీభావం ప్రకటిస్తున్న బీసీ అఖిలపక్ష నాయకులు

రిజర్వేషన్ల సాధనకు ఐక్య ఉద్యమం

- 18న రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేద్దాం
- తాండూరులో అఖిలపక్ష బీసీ నాయకుల భేటీ

తాండూరు: రిజర్వేషన్లు సాధించే వరకు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఐక్యంగా ఉద్యమిస్తామని నాయకుడు ఈడిగి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ కన్వెన్షన్‌లో బీసీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాలు, కులసంఘాలు, బీసీ మేధావుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించినా హైకోర్టు స్టే విధించడంతో అన్యాయం జరిగిందన్నారు. 42 శాతం రిజర్వేషన్ల సాధనకు బీసీ కులాలంతా ఏకమై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రిజర్వేషన్లు అమలయ్యాకే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అందుకు పార్టీలు, కులాలకతీతంగా ఏకమై పోరాడేందుకు ముందుకు రావడ ఆనందంగా ఉందన్నారు. రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. త్వరలో బీసీ జేఏసీ ఏర్పాటు చేసి కార్యచరణ రూపొందిస్తామని ప్రకటించారు. ఈ నెల 18న జరిగే రాష్ట్ర వ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, మాజీ కౌన్సిలర్ సోమశేఖర్, ప్రభాకర్‌గౌడ్, నాయకులు ఉత్తమ్‌చంద్, మల్కయ్య, శ్రీనివాస్, విజయ్‌కుమార్, సంతోశ్, కె.గోపాల్, రాజన్‌గౌడ్, రజినీకాంత్ తదితరులున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎంఆర్

తాండూరు: కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మున్సిపల్ పరిధిలోని సమద్ ఫంక్షన్ హాల్‌లో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 160 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తున్నానన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో పేదల సొంతింటి కల సాకారం చేశామన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పేదలకు ఒక్క ఇంటిని నిర్మించి ఇవ్వలేకపోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, మాజీ కౌన్సిలర్లు నర్సింహులు, ప్రభాకర్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాల కోసం పెన్‌డౌన్



ఆందోళన చేస్తున్న అతిథి అధ్యాపకులు

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు బహిష్కరించిన గెస్ట్‌లెక్చరర్స్
- ఆందోళన బాటపట్టిన అతిథి అధ్యాపకులు

బొంరాస్‌పేట: మండల కేంద్రంలో నూతనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుతో హర్షం వ్యక్తం చేశారు. గతేడాది పరిగిలో కొనసాగిన కళాశాల ఈ ఏడాది మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ అదనపు తరగతి గదుల్లో ప్రారంభించారు. కాగా కళాశాల ప్రారంభం నాటి నుంచి తమకు వేతనాలు పెండింగ్‌లోనే పెట్టారని ఇక్కడ పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు నాలుగు రోజులుగా ఆందోళన చేపట్టారు. ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో బుధవారం విధులు బహిష్కరించారు. దీంతో కళాశాలకు వచ్చిన విద్యార్థులు కాలక్షేపం చేశారు.

పది మంది అడ్మిషన్లు వెనక్కు..

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌తోపాటు ఇద్దరు రెగ్యులర్ అధ్యాపకులు, ఎనిమిది మంది అతిథి అధ్యాపకులున్నారు. రెండు తెలుగు, సోషల్ అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ 130 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు. అధ్యాపకులు లేకపోవడంతో బోధన సాగడం లేదని పది మందికిపైగా విద్యార్థులు కళాశాలనుంచి వెళ్లిపోయారు.

కాలక్షేపం చేయాల్సి వస్తోంది



మా కళాశాలలో గెస్ట్ లెక్చరర్స్ ఎక్కువగా ఉన్నారు. వారికి సమయానికి వేతనాలు రావడం లేదని బోధన చేయడం లేదు. దీంతో కాలక్షేపం చేయాల్సి వస్తోంది.

– మల్లేశం, బైపీసీ విద్యార్థి

బోధన చేయడం లేదు



లెక్చరర్స్ వేతనాలు రాకపోవడంతో తరగతులు బహిష్కరించారు. దీంతో మాకు బోధన కరువైంది. ఇంటర్ బోర్డు అధికారులు స్పందించి తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి.

– భూమిక, బైపీసీ విద్యార్థి

ప్రజాభిప్రాయం మేరకే భూసేకరణ చేయాలి

యాచారం: ప్రజాభిప్రాయం మేరకే భూసేకరణ చేపట్టాలని రైతులు పేర్కొన్నారు. మొండిగౌరెల్లిలోని 19,68,127 సర్వేనంబర్లలో 820 ఎకరాల అసైన్డ్, ప్రభుత్వ భూమి సేకరణపై బుధవారం యాచారం తహసీల్దార్ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డితో రైతులు సమావేశం కావాల్సి ఉంది. ఆర్డీఓ కోర్టుకు వెళ్లడంతో రాలేకపోయారు. దీంతో పెద్ద సంఖ్యలో వచ్చిన రైతులు తహసీల్దార్ అయ్యప్పకు వినతిపత్రం అందజేశారు. ఏళ్లుగా పంటలు పండించుకుని జీవనోపాధి పొందుతున్నామని, అలాంటి భూములను తీసుకుంటే ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామసభ ఏర్పాటు చేసి మెజార్టీ రైతుల అభిప్రాయం మేరకే సేకరణ చేపట్టాలని, లేని పక్షంలో ఆందోళన తప్పదన్నారు.

మట్టి తవ్వకాలు ఆపేయండి



అంతారం గ్రామ శివారులోని అసైన్డ్‌భూమిలో మట్టి తవ్వకాలు నిలిపివేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న దళిత రైతులు

- పురుగు మందు డబ్బాలతో దళిత రైతుల ఆందోళన
- కాంట్రాక్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు

తాండూరు రూరల్: తమ భూముల్లో చేపట్టిన మట్టి తవ్వకాలను వెంటనే నిలిపేయాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. లేదంటే పురుగు మందు తాగి ఇక్కడే చనిపోతామని హెచ్చరించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తాండూరు మండలం అంతారం గ్రామ శివారులోని అసైన్డ్ భూమి నుంచి తాండూరు- చించోళి జాతీయ రహదారి పనులకు సంబంధిత కాంట్రాక్టర్ పెద్ద ఎత్తున మట్టి తరలిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన దళిత రైతులు స్వామిదాస్, బాలమ్మ, తుల్జమ్మ, బాలప్ప, మొగులప్ప, సామేల్‌లు తదితరులు అక్కడికి చేరుకున్నారు. వెంటనే తవ్వకాలు నిలిపివేయాలని లేదంటే పురుగుల మందు తాగి చస్తామని కాంట్రాక్టర్‌కు హెచ్చరించారు. అనంతరం సదరు కాంట్రాక్టర్‌పై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా మట్టి తవ్వకాల పంచాయితీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వద్దకు వెళ్లినట్లు తెలిసింది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఏమీ తెలియనట్లు వ్యవహరించడం గమనార్హం. ఈ విషయమై తహసీల్దార్ తారాసింగ్‌ను వివరణ అడగగా.. మట్టి తవ్వకాల కోసం తామెవరికీ అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. మైనింగ్ ఏడీ సత్యనారాయణకు ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.



పురుగు మందు డబ్బాతో మహిళా రైతులు బాలమ్మ, తుల్జమ్మ

ఇంకా తేలని రుణాల లెక్క!

డ్వాక్రా సంఘాల నిధుల గోల్‌మాల్

- కొనసాగుతున్న అధికారుల విచారణ
- తాజాగా ఏపీఎం, సీసీపై సస్పెన్షన్ వేటు



చౌదర్‌పల్లిలో వివరాలు సేకరిస్తున్న యాచారం ఎస్‌బీఐ, ఐకేపీ అధికారుల బృందం (ఫైల్)

యాచారం: డ్వాక్రా సంఘాల నిధుల గోల్‌మాల్ విషయంలో అప్పటి ఐకేపీ ఏపీఎం సుదర్శన్‌రెడ్డి, చౌదర్‌పల్లి సీసీ జంగయ్యపై సస్పెన్షన్ వేటు వేస్తూ డీఆర్‌డీఓ శ్రీలత ఉత్తర్వులు జారీ చేశారు. చౌదర్‌పల్లి వీకేబీ (విలేజ్ బుక్ కీపర్) వరలక్ష్మి పర్యవేక్షణలో 25 గ్రామ స్వయం సహాయక సంఘాల్లో రూ.లక్షలాది నిధుల పక్కదారి పట్టాయంటూ రెండు నెలల క్రితం మహిళలు ఆందోళనకు దిగారు. రుణాలు తీసుకోనప్పటికీ యాచారం ఎస్‌బీఐ ఖాతాల్లో అప్పులను గుర్తించిన మహిళలు సాగర్‌రోడ్డుపై ఉన్న బ్యాంకు ఎదుట బైఠాయించి ఆందోళనకు చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, డీఆర్‌డీఓ శ్రీలతకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన డీఆర్‌డీఓ ఉన్నతాధికారులు నిధుల గోల్‌మాల్ జరిగిందని నిర్ధారించారు. 25 స్వయం సహాయక సంఘాల్లో రూ.10 లక్షల నుంచి రూ.15లక్షల అప్పులున్నట్లు రికార్డుల్లో నమోదైంది.

రికార్డుల్లో లేని రూ.3 కోట్ల రుణాలు

చౌదర్‌పల్లిలో 40కి పైగా స్వయం సహాయం సంఘాలకు యాచారం ఎస్‌బీఐ నుంచి రూ.7 కోట్ల రుణాలు ఇచ్చినట్లు రికార్డులు ఉన్నాయి. నిధుల స్వాహా వెలుగులోకి రావడంతో విచారణ చేపట్టగా మొత్తం రూ.7 కోట్లకు గాను రూ.4 కోట్ల రుణాలకు సంబంధించి మాత్రమే రికార్డులున్నట్లు గుర్తించారు. రూ.3 కోట్లకు లెక్కలు లేకపోవడంతో డీఆర్‌డీఓ ఉన్నతాధికారులు బ్యాంకు సిబ్బంది పాత్రపై ఎస్‌బీఐ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు.

ఉన్నతాధికారులకు కలెక్టర్ లేఖ

చౌదర్‌పల్లి, మల్కీజ్‌గూడ స్వయం సహాయక సంఘాల నిధుల గోల్‌మాల్‌కు సంబంధించి అప్పటి ఎస్‌బీఐ మేనేజర్ ఝాన్సీరాణి పాత్రే కీలకమని, ఆమెను విధుల నుంచి తొలగించి విచారణ చేపట్టాలని.. నిధులను రికవరీ చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఎస్‌బీఐ ఉన్నతాధికారులకు లేఖ రాశారు. ఎస్‌బీఐ మేనేజర్ మల్కీజ్‌గూడ, చౌదర్‌పల్లి గ్రామాల్లోని వీబీకేల ద్వారా బ్యాంకు నుంచి సంఘాల్లో లేని మహిళల పేర్ల మీద రూ.లక్షలాది నిధులను బదిలీ చేశారు. తర్వాత వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నట్లు అధికారులు గుర్తించారు. వారం రోజులుగా మల్కీజ్‌గూడ, చౌదర్‌పల్లి గ్రామాల్లో యాచారం ఎస్‌బీఐ, ఐకేపీ అధికారుల బృందం కలిసి మహిళలతో సమావేశమై విచారణ చేపడుతున్నారు. తాజాగా రెండు గ్రామాల్లో రూ.10 నుంచి రూ.20 లక్షల్లోపు రికవరీ చేసినట్లు తెలుస్తోంది.

విచారణ కొనసాగుతోంది



అప్పటి యాచారం ఎస్‌బీఐ మేనేజర్ సహకారంతోనే రూ.లక్షలాది నిధులు గోల్‌మాల్ అయ్యాయి. చౌదర్‌పల్లి, మల్కీజ్‌గూడ స్వయం సహాయక సంఘాల్లో బ్యాంకు మేనేజర్ చేతివాటం ఉంది. ఆమెను విధుల నుంచి తొలగించి నిధులు రికవరీ చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఎస్‌బీఐ ఉన్నతాధికారులకు లేఖ రాశారు. ఇంత జరుగుతున్నా పర్యవేక్షించని ఏపీఎం సుదర్శన్‌రెడ్డి, సీసీ జంగయ్యను సస్పెండ్ చేశాం. విచారణ కొనసాగుతోంది.

– శ్రీలత, డీఆర్‌డీఓ

లగచర్లలో లఘు చిత్రం షూటింగ్



దుద్యాల్ ఠాణా సమీపంలో షూటింగ్



ఎస్‌ఐకు సీన్‌ను వివరిస్తున్న డైరెక్టర్ రమేశ్

దుద్యాల్: మండల కేంద్రంలో బుధవారం లఘు చిత్రం షూటింగ్ సాగింది. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరించేందుకు లగచర్లకు చెందిన ఈర్లపల్లి రమేశ్ లఘు చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. మత్తు పదార్థాలను తీసుకునే యువతకు పోలీసుల కౌన్సిలింగ్ విధానాన్ని చిత్రీకరించారు. స్థానిక ఎస్‌ఐ యాదగిరి, సిబ్బంది ఈ సీన్‌లో కనిపించనున్నారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. యువత మత్తుకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని చిన్న ప్రయత్నం చేస్తున్నాని చెప్పుకొచ్చారు.